క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10:30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీవో ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులను అందించాలని కోరారు.

వెదుళ్లపాలేన్ని వణికిస్తున్న జ్వరాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెం ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యిర్రింకి శంకరం (55) జ్వరంతో రక్తకణాల సంఖ్య తగ్గిపోయి పాలకొల్లులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. శంకరానికి భార్య, కుమారుడు ఉన్నారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన మాదు గణేష్, మాదు శ్రీనివాసరావులు కూడా జ్వరంతో రక్తకణాలు తగ్గిపోయి పాలకొల్లులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మాదు ధనలక్ష్మి, మాదు నారాయణలు ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందికోలుకున్నారు. ముఖ్యంగా వెదుళ్లపాలెంలోని మురుగు డ్రెయిన్ సమస్య కారణంగా వెదుళ్లపాలెం ప్రజలు గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో పశు సంపద కూడా ఎక్కువే. మురుగునీరు పారుదల లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి దోమలు పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



బాపిరాజుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెలిదిండి మణికంఠ

వీరవాసరం: ప్రమాదంలో గాయపడిన రాయకుదురుకు చెందిన గాదిరాజు బాపిరాజు హైదరాబాద్‌లో ఉంటున్నారు. గ్రామ వలంటీర్ వెలిదిండి మణికంఠ అక్కడికి వెళ్లి ఆయనకు పెన్షన్ అందజేశారు. వలంటీర్‌ని సర్పంచ్ గెడ్డం భారతి, అధికారులు అభినందించారు.

సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

భీమవరం: సీపీఎం జిల్లా విస్తృత సమావేశం చాంబర్ ఆఫ్‌కామర్స్ హాలులో బి.వాసుదేవరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రం నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.బలరాం, చింతకాయల బాబూరావు, జేఎన్‌వీ గోపాలన్, డి.కళ్యాణి, కేతా గోపాలన్ పాల్గొన్నారు.

ముగిసిన చిల్డ్రన్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు

భీమవరం: శ్రీఅల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్కూల్ చిల్డ్రన్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ చిన్నారులు విద్యతో పాటు చెస్ పోటీ పోటీల్లో పాల్గొనడం ద్వారా మేధస్సును పెంపొందించుకోవచ్చన్నారు. చిన్నారులకు ఉపయోగపడేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల రాజు, ఝాన్సీ లక్ష్మి, ఎంఎస్ఎన్ రాజు, తోట హరిబాబు, వై.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బాలోత్సవం

భీమవరం: పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో ఈనెల 30, 31 తేదీల్లో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వసుధా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీరాంపురం గాంధీ కస్తుర్బా భవనంలో ఆదివారం నిర్వహించిన బాలోత్సవ కమిటీ సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. సుమారు 4 వేల మంది బాలలతో కార్యక్రమం రూపొందించామన్నారు. మొత్తం 10 అంశాలల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. భీమవరం పట్టణం, రూరల్, పాలకోడేరు, ఉండి, కాళ్ల, వీరవాసరం మండలాల పరిధిలోగల ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కె.మురళీ కృష్ణంరాజు, పి.సీతారామరాజు, షేక్ వలీ, జి.జేమ్స్ పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యం.. కంగారులో రైతాంగం

- మిచాంగ్ దెబ్బకు రైతన్నల ఆందోళన
- తీరంలో ఎగసి పడుతున్న అలలు

నరసాపురం రూరల్: తుపాను పేరు చెబితేనే రైతులు భయపడుతున్నారు. ఇప్పటివరకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉన్నామని, ఈ సమయంలో తుపానుల కారణంగా కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట నష్టపోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటను ఆన్‌లైన్లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా అమ్ముకోవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఆదివారం ఎక్కడ చూసినా ఎక్కడికక్కడ గ్రామస్థాయిలో కల్లాల్లోని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడం, కోసిన వరిని ఒబ్బిడి చేసుకునే దృశ్యాలే కనిపించాయి. ఈ ఏడాది సాగుచేపట్టిన రైతులు ఆరంభంలో అధిక వర్షాలతో ఇబ్బందులు పడ్డ ప్రస్తుతం కుదిటపడ్డారు. ఈ పరిస్థితిలో తుపాను ఏర్పడడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గత రాత్రి నుంచి వీస్తున్న ఈదురుగాలులకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నరసాపురం, మొగల్తూరు సముద్ర తీర ప్రాంతాల్లో మండల తహసీల్దార్లు పర్యటించి మత్స్యకారులు, తీరప్రాంత గ్రామాల ప్రజలతో మాట్లాడారు. మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి విలయతాండవం చేయడంతో ఇప్పటి వరకూ రైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. చేతికందిన పంట పనలపై ఉన్నా, కల్లాల్లో ఉన్నా, కోతకు వచ్చిన సమయాల్లో ప్రకృతి విలయతాండవం వల్ల నోటికందకుండా పోతుంది. రైతుకు తుపానులు శాపంగా మారాయి. ప్రస్తుతం మిచాంగ్ తుపాను తీవ్ర రూపం దాల్చనుందని రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే)లు ప్రస్తుతం ఎంతగానో దోహదపడుతున్నాయి. గతంలో రైతులు చేతికందిన పంటను ప్రకృతి విలయం నుంచి తప్పించుకోలేక కల్లంలో ఉన్న పంటను, పనలపై ఉన్న పంటను ఒబ్బిడి చేసుకున్నంత వరకూ చేసుకుని ఇంక ఒబ్బిడి చేయలేక అలా వదిలేసేవారు. ఆ పంటను ఒబ్బిడి చేయలేక బాతులకు, పందులకు కూడా వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం అధికారులు మిచాంగ్ తుఆపను పట్ల విస్తృత ప్రచారం చేయడంతో రైతులు కూడా అధికారులకు సహకరిస్తూ వారు చెప్పిన విధంగా పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. ప్రస్తుతం వరి పంటను పండించి కల్లాల్లో నిల్వ ఉంచిన పంటను అధికారులే దగ్గరుండి సంచుల్లోకి ప్యాక్ చేయించి ఆ గ్రామంలో ఉన్న ఆర్‌బీకే పరిధిలో ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు కల్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని సంచుల్లోకి ఎక్కించి ట్రాక్టర్లపై లోడు చేయించి సంబంధిత రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శివరామ్‌ప్రసాద్ ఆదివారం పాలకొల్లు నియోజకవర్గంలో పర్యటించారు. కల్లాల్లోకి వెళ్లి దాన్యం పట్టుబడులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను ప్రభావం వల్ల నష్టపోకుండా ఉండడానికి వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. పాలకొల్లు వ్యవసాయ శాఖ ఏఓ శామ్యూల్ జాన్సన్, యలమంచిలి ఏఓ దేవి, పోడూరు ఏఓ జి సత్యనారాయణ, పాలకొల్లు సీఎస్‌డీటీ సత్యనారాయణ తదితరులు పంట పొలాల్లో పర్యటిస్తూ రైతన్నలకు అండగా నిలుస్తున్నారు.



నరసాపురం రూరల్: పేరుపాలెంలో ఎగసిపడుతున్న సముద్రపు అలలు



మొగల్తూరు: ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని సంచుల్లోకి పడుతున్న రైతులు



నరసాపురం రూరల్: బియ్యపుతిప్పలో ఒడ్డుకు చేరిన పడవలు, మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు



పాలకొల్లు సెంట్రల్: కల్లాల్లో దగ్గరుండి ధాన్యం పట్టుబడి చేయిస్తున్న అధికారులు

వనసమారాధనలు మన సంస్కృతిలో భాగం



నరసాపురం: బ్రాహ్మణ కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ: ఆర్యవైశ్యుల వనసమారాధనలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

నరసాపురం: కార్తీక వనసమారాధనలు మన సంస్కృతిలో భాగమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మీ కల్యాణ మండపంలో నిర్వహించిన బ్రాహ్మణ కార్తీక వనభోజనాల కార్యక్రమంలో ముదనూరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్తీక వన భోజనాలు ఐక్యతను చాటుతాయన్నారు. అలాగే తెలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పీచుపాలెంలో తెలకుల కార్తీక వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూడా ముఖ్య అతిథిగా పాల్గొన్న ముదునూరి ప్రభుత్వం అన్నికులాల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతుందని చెప్పారు.

వన సమారాధనలు ఐక్యతను పెంచుతాయి

పెనుగొండ: వన సమారాధన ఐక్యతను పెంపొందిస్తాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుగొండ లింగాలవీధిలో ధర్మారెడ్డి రెడ్డి కల్యాణ మండపంలో జరిగిన రెడ్డి మహాజన వన మహోత్సవంలోనూ, పెనుగొండ శ్రీలక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్య కార్తీక వన సమారాధనలో పాల్గొన్నారు.

ఆచంటలో..

వ్యాపారంతో పాటు సేవా తత్వంతో ముందుకు వెళ్లాలని ఆచంట శెట్టి బలిజ వర్తక సంఘ అధ్యక్షుడు పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం ఆచంట ఏఎంసీ శెట్టి బలిజ వర్తక సంఘ వార్షికోత్సవం కార్తీక వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆచంట ఛాంబర్ అధ్యక్షుడు కేతా రామకృష్ణ, శెట్టిబలి సాధికార రాష్ట్ర డైరక్టరు గుడాల శ్రీనివాస రావు, సంఘ నాయకులు దొంగ నాగార్జు, పెచ్చెట్టి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పెచ్చెట్టి రామకృష్ణ, గంజి శ్రీనివాస్, గుబ్బల జగదీష్, కేతా రామాంజనేయులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

సిద్ధాంతం గ్రామ ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక లాకుల వద్ద కార్తీక వన సమారాధన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక దామోదర పూజలు అనంతరం మండపం నుంచి వానరం ప్రసాదం స్వీకరించి వెళ్లడంతో అందరూ సాక్షాత్తు ఆంజనేయ స్వామి ప్రసాదం స్వీకరించారంటూ వానరానికి మొక్కుకున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అగ్రకుల పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుమంట్ర గ్రామంలో రెడ్డి యూత్ లయన్స్ ఆధ్వర్యంలో ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెడ్డి కులస్తులు ఐక్యంగా ఉంటూ పేద కుటుంబాలకు సహకారం అందించాలని కోరారు. మరో ముఖ్య అతిధి రాజమండ్రి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ అగ్రకుల పేదలను జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈసందర్భంగా రెడ్డి యూత్ తరపున శ్రీరంగనాథరాజును, షర్మిలారెడ్డిని, కాశీ విశ్వేశ్వరరెడ్డిని, ఎంపీపీ వెంకట నారాయణరెడ్డిని సభలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తేతలి సుధీర్‌రెడ్డి, రెడ్డి కొవ్వూరి నాగరాజ మోహన్‌రెడ్డి, మార్టేరు ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ జోగిరెడ్డి, తేతలి హరి ప్రసాద్‌రెడ్డి, నల్లమిల్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

సంఘీయులు ఐక్యతగా ముందుకు సాగాలి

పాలకొల్లు అర్బన్: శెట్టిబలిజ సంఘీయులు ఇతర కుల సంఘీయులతో ఐక్యతగా ఉంటూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు కోరారు. పాలకొల్లు నియోజకవర్గ శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఆదివారం ఏఎంసీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టాక్సీ స్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సంఘ నేత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని గుడాల గోపి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, సంఘ నాయకులు దొమ్మేటి సుధాకర్, వనుము సత్య కల్యాణి, శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్, గూడూరి హనుమంత రావు, కడలి గోపి, కవురు మధు, మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ది పాలకొల్లు ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు నీలం రవి అధ్యక్షతన జరిగిన కార్తీక వనసమారాధనలోనూ, అలాగే శాలివాహన (కుమ్మరి) సంఘ ఆధ్వర్యంలోనూ, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధనలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు పాల్గొని సంఘీయులను అభినందించారు.

లంకలకోడేరులో..

లంకలకోడేరు క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రామసూరి కొబ్బరితోటలో ఆదివా రం కార్తీక వనసమారాధన చేశారు. సర్పంచ్ చొప్పల రజని పాల్గొని సంఘీయులను అభినందించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు వేణురాజు, ప్రసాదరాజు, పెన్మెత్స రామసత్యనారాయణరాజు, పుల్లయ్య మాస్టారు, మురళీకృష్ణంరాజు, రామలింగరాజు, ఆగర్రు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ కార్తీక వనసమారాదన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి వనసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోనసీమ జిల్లా అమలాపురం ఎస్సై బి.దిలీప్ చైతన్య మాట్లాడుతూ వనసమారాధనలు ఐక్యతను పెంచుతాయన్నారు. చిన్నారులు, మహిళలు ఆట పాటలతో సందడి చేయగా అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బాసిన గుణేశ్వర రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ఊటుకూరి భోగేశ్వరరావు, ద్వార ప్రభాకర రావు, యర్రా శివాజీ పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్: టాక్సీస్టాండ్ సమీపంలో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



పెనుమంట్ర: మేడపాటి షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న రెడ్డి యూత్ లయన్స్ మహిళా సభ్యులు



పాలకొల్లు సెంట్రల్: దేవాంగ వనసమారాధనలో అతిథులు

వైభవంగా గణపతి హోమం



గణపతి హోమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలో ఉన్న రామాలయంలో అయ్యప్ప స్వాములు గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున మారుతి స్వామి పీఠం ఆధ్వర్యంలో సుమారు 40 మంది అయ్యప్ప స్వాములు గణపతి హోమంలో పాల్గొన్నారు. కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 35వ పర్యాయం మాల ధరించి స్వామివారి సన్నిధికి వెళుతున్నట్లు మారుతి స్వామి తెలిపారు. హోమం అనంతరం స్వాములకు ఇరుముళ్లు కట్టి సాయంత్రం శబరిమల పయనమయ్యారు. తుఫాన్ కారణంగా రైళ్లు రద్దు కావడంతో బస్‌లో శబరిమలై వెళుతున్నట్లు స్వాములు తెలిపారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విభిన్న ప్రతిభా వంతుల అభ్యున్నతికి వారి హక్కులు కాపాడడానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. ఆదివారం స్థానిక అంజలి మానశిక వికలాంగుల పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ ఆటల పోటీల్లో విజేతలైన 50 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ షేక్ ఫీర్ సాహెబ్, పాఠశాల నిర్వాహకులు వీడీవీ ప్రసాదరావు, క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్ పాల్గొన్నారు.

70 శాతం సంక్షేమం ఎస్సీ, ఎస్టీలకే

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన వాటిలో 70 శాతం నిధులు దళితులకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తుందని ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. భీమవరం వ్యవసాయ మార్కెటు కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. అర్హత ప్రమాణికంగా పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత ఇతర ఏ రాష్ట్రంలో ఇవ్వలేదని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇద్దరు, ముగ్గురు దళితులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని కానీ ఈ ప్రభుత్వంలో నూటికి నూరు శాతం దళితులకు న్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎంత శాతం నిధులు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఖర్చు పెట్టిందన్న లెక్కలు ఎస్సీ కమిషన్ రికార్డులను చూస్తే తెలుస్తుందన్నారు. సమావేశంలో భీమవరం అగ్రికల్చర్ మార్కెటు కమిటీ వైస్ చైర్మన్ శిరీష, జొన్నలగరువు సర్పంచ్ సోడదాసి లలిత కుమారి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబరు చవ్వాకుల భరత్, జె. సత్య సుదమా తదితరులు పాల్గొన్నారు.

తుపాను పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం



నరసాపురం: తుఫాన్‌పై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎంఏ అంబరీష్

నరసాపురం: తుపాను ప్రభావిత పరిస్థితులను సమర్థవంతంతగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీఓ తన ఛాంబర్‌లో బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పోలీస్, ఆరోగ్యశాఖ, పీఆర్, విద్యుత్, ఇరిగేషన్, డ్రైయినేజీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ముఖ్యంగా తుపాను నేపథ్యంలో ముందుగా తీరప్రాంత వాసులను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే తుఫాన్ తీవ్రత తగ్గే వరకూ పేరుపాలెం బీచ్‌కు ఎట్టి పరిస్థితుల్లోను సందర్శకులను అనుమతించవద్దని ఆర్డీఓ పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వాకపల్లి ప్రసాద్, తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, జి.అనితకుమారి, ఎంపీడీఓలు వీకే వీరభద్రరావు, యు.బాబ్జీరాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ: వడలిలో రైతులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ ఎంఏ అంబరీష్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎంఏ అంబరీష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెనుగొండ మండలంలో వడలి, ఇతర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని జీపీఎస్ వాహనాల ద్వారా రైసుమిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డి, వ్యవసాయాధికారి పి.స్పందన ఉన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: తీవ్ర తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఆదివారం పెనుమంట్ర మండలంలోని ఆలమూరు, వెలగలేరు, గ్రామాలలో పర్యటించి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆలమూరులోని ఒక రైస్ మిల్లును తనిఖీ చేసి యజమానికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ డివీ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పద్మజ, వ్యవసాయ అధికారిణి అంగర జ్యోష్న్యల, ఏఈఓ సత్యనారాయణ ఉన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: తుపాను కారణంగా సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాలైన పెదమైనవానిలంక, చినలంక, వేములదీవి తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ పర్యటించారు. గ్రామాల్లోని ప్రజలతో ఆయన మాట్లాడారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట నరసాపురం తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్ ఉన్నారు.